తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
మంగళవారం
12 మే 2026
పేజీలు : 8



## జనగణన గృహ జాబితా ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- ○ కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ○ మే 11 నుంచి జూన్ 9 వరకు జిల్లాలో గృహ జాబితా సర్వే నిర్వహణ
- ○ ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన చెల్లింపులు చేయాలి
- ○ పెద్దకల్వల గ్రామంలో జనగణన కార్యక్రమం, పెద్దపల్లి లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి,మే 11(జనంసాక్షి) :**
జిల్లాలో జనగణన గృహ జాబితా ప్రక్రియను సమగ్ర ప్రణాళికతో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామంలో నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు జిల్లాలో జనగణన గృహ జాబితా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గృహ జాబితా సర్వేలో నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, ఫోన్, ఇంటర్నెట్ సదుపాయం, ఆహారపు అలవాట్లు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నల వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 1548 హౌసింగ్ లిస్ట్ బ్లాకులు (ఎచ్ ఎల్ బి) గుర్తించగా, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని తెలిపారు. మే 11 నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు తప్పనిసరిగా క్యూ ఆర్ కోడ్ ఉన్న ఐడీ కార్డులు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి హౌసింగ్ లిస్ట్ బ్లాక్‌కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి గృహ జాబితా ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రతి ఇంటి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. జనగణన చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ వివరాలు అందించాల్సిన బాధ్యత ఉందని, ఎవరూ వివరాలు ఇవ్వకుండా నిరాకరించరాదని స్పష్టం చేశారు. అనంతరం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు లోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ గోదాంను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.సాధారణ తనిఖీల్లో భాగంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.తదుపరి పెద్దపల్లి మార్కెట్ యార్డు లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని, ఎక్కువ సంఖ్యలో హమాలీలు, అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.కొనుగోలు ప్రక్రియ మరింత వేగం పుంజుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్ వంటి ప్రక్రియలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలలో సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## రైతన్నల నిరసన గళం

### ఇల్లంతకుంట వివేకానంద చౌరస్తాలో పొద్దు తిరుగుడు, వడ్లు, మక్కలు వెంటనే కొనుగోలు చేయాలని రైతులు ధర్నా

**ఇల్లంతకుంట మే 11(జనంసాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. పొద్దుతిరుగుడు, వడ్లు, మక్కలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పంటలు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలు పడే అవకాశాలు ఉండటంతో ధాన్యం తడిసి నష్టపోతమని రైతులు తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేయకుండా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి రైతుల పంటలను కొనుగోలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.
ధర్నాలో పలువురు రైతులు, పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలకు చిన్నారి శాన్విక ఎంపిక

**ఇల్లంతకుంట మే 11(జనంసాక్షి )**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్ గ్రామానికి చెందిన కొలనూరు శాన్విక రెడ్డి( 8)సంవత్సరాల బాలిక 400మీటర్ల పరుగు పందెం జిల్లాలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. జీతేందర్ రెడ్డి -ప్రణీత దంపతుల కూతురు శాన్విక ఫస్ట్ క్లాస్ చదువుతున్నది.శాన్విక సిరిసిల్లలోని శ్రీ చైతన్య పాఠశాల చదువు తున్న శాన్విక జిల్లా స్థాయిలో నిర్వహించిన 400మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం నిలిచి అందరిని అబ్బురుపరిచింది. దీనితో రాష్ట్ర స్థాయిలో జరిగే అథ్లెటిక్ పరుగు పందెం పోటీలకు ఎంపిక అయినట్లుగా నిర్వాహకులు తెలిపారు. దీనితో తల్లిదండ్రులతో పాటు గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, సాయి కుమార్,అశోక్ లు అభినందనలు తెలిపారు.

## మహిళా సమైఖ్య సంఘ భవనం ప్రారంభించిన సుడా చైర్మన్

○మహిళా సాధికారత కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం
○సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో,మే 11(జనంసాక్షి) :**
కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ఖాన్ పేట లో పది లక్షలతో నిర్మించిన మహిళా సమైఖ్య భవనాన్ని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... జాతీయ ఉపాధి హామీ పథకం సంబంధించిన నిధులతో నిర్మించిన మహిళా భవనం సోమవారం రోజు ప్రారంభిం చుకోవడం సంతోషంగా ఉందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను మహిళా సాధికారత దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తోందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సర్పంచ్ గుర్రం సంధ్య తిరుపతి రెడ్డి ఈ సంఘ భవనం త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జగన్ మోహన్ రెడ్డి, డీఈ జనార్దన్, ఏఈ సమ్మయ్య, కామ్రెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి, సర్పంచులు మోతే ప్రశాంత్ రెడ్డి, బోగొండ ఐలయ్య, కూర నరేష్ రెడ్డి, కమల్ గౌడ్, లక్ష్మి నారాయణ, రాజు, అంజయ్య, బాపురెడ్డి, తిరుపతి, అంజయ్య, మహిళ మండల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ వైర్లతో పొంచివున్న ప్రమాదం

### కర్రతో తాత్కాలిక స్తంభం ఏర్పాటు చేసిన రైతులు

**ముత్తారం మే 11(జనంసాక్షి)**
విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని అధికార్లకు పిర్యాదు చేసినప్పటికీ పట్టించు కోవడం లేదని రైతులు ఆరోపించారు. పోతారం నుండి పారుపల్లి రహదారికి ఒర్రెపై బ్రిడ్జి నిర్మించడం తో ఆ రహదారి కి మూడు చోట్ల విద్యుత్ వైర్లు మనుషులకు తగిలే విధంగా ఉండగా రైతులు తాత్కాలికం గా స్తంభాలకు బదులుగా కర్రలను ఏర్పాటు చేశారు వీదురు గాలులకు వైర్లు రోడ్ పై పడుతున్నాయని రాత్రి పగలు రాకపోకలు సాగించే వారికి రైతుల కు ఇబ్బంది గా ఉందని విద్యుత్ అధికార్లకు మొర పెట్టుకున్న పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యుత్ వైర్లు ప్రమాద కరంగా ఉన్నాయని ముత్తారం విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకుంట లేదని పోతారం సర్పంచ్ ఊట్ల చరణ్ ఆరోపించారు. రోడ్ కు మూడు చోట్ల విద్యుత్ వైర్లు ప్రమాద కారంగా ఉన్నాయని పోల్స్ కు బదులుగా రైతులు కట్టెలు ఏర్పాటు చేశారని చెప్పినా కనీసం సంఘటన స్థలాన్ని పరిశీలించడం రాలేదని పేర్కొన్నారు.ఏదైనా ప్రమాదం జరిగితే దాని బాధ్యత విద్యుత్ అధికారులే భరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.





## కలెక్టర్ ను కలిసిన బోధన్ ఆర్డీఓ

**నిజామాబాద్ అర్బన్ మే 11 జనంసాక్షి :**
బోధన్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. రెవెన్యూ, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సక్రమంగా జరిగేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

## యూనివర్సిటీ సైన్స్ కాలేజీలో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన రిజిస్ట్రార్

**నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీ మే 11:జనంసాక్షి**
తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 99-రోజుల ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక మరియు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల (2026 మే 11 నుండి మే 17 వరకు)లో భాగంగా సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ. ఎం. యాదగిరి యూనివర్సిటి సైన్స్ కాలేజీ లో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ తో పాటు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య జి. రాంబాబు, డాక్టర్ యం. సత్యనారాయణ మరియు ఇంజనీర్ బి. వినోద్ పాల్గొన్నారు.



## తెలంగాణ విశ్వవిద్యాలయంలో సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం

**నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీ మే 11జనంసాక్షి**
తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 99-రోజుల ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక మరియు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల (2026 మే 11 నుండి మే 17 వరకు)లో భాగంగా, ఈరోజు తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ. ఎం. యాదగిరి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో యూనివర్సిటీ సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో అధునాతన పరిశోధనలు చేసేందుకు ఈ సెంటర్‌లో ఔఓఖీ, జ౦, ఎఖీ మరియు ఉఅ వంటి అనేక ముఖ్యమైన పరికరాలు అమర్చబడి ఉన్నాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన విశ్వవిద్యాలయాలలో ఇదే మొట్టమొదటి ఫెసిలిటీ సెంటర్ అని పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థుల ప్రయోజనం కోసం తెలంగాణ విశ్వవిద్యాలయం సుమారు రూ. 1.6 కోట్లు పెట్టుబడితో ఈ కేంద్రాన్ని అందుబాటులో కి తెచ్చింది. సైన్స్ విభాగాలకు చెందిన పరిశోధక విద్యార్థులు మరియు అధ్యాపక బృందం ఈ సదుపాయాన్ని వినియోగించుకొని సైన్స్ లో మరిన్ని కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంటర్ డైరెక్టర్ డా. మావురపు సత్యనారాయణ, డాక్టర్ వాసం చంద్రశేఖర్, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. జి. రాంబాబు, యూనివర్సిటీ ఇంజనీర్ బి. వినోద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు బిఆర్ఎస్ మాజీ సర్పంచులు

**రుద్రంగి మే 11 (జనం సాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మాజీ సర్పంచులు టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు వాటిలో చేరిన వారిలో సర్పంచ్ తండా మాజీ సర్పంచ్ మాళవత్ రమణయ్య,రూప్లా తండా జగదంబ సేవాలాల్ గుడి చైర్మన్ భూక్యా నారాయణ నాయక్,సీనియర్ నాయకులు నాయకులు అజ్మీరా విఠల్,లక్పతి,లకవత్ విష్ణు ,భూక్యా శర్మన్ నాయక్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.వారు మాట్లాడుతూ కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారా మాత్రమే అబివృద్ధి సాధ్యం అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి,నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



**భిక్కనూరు మే 11 (జనంసాక్షి)**
మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల యందు వేసవి విజ్ఞాన క్యాంప్ సోమవారం ప్రారంభమైనది, ఈక్యాంపుకు మొదటి రోజున 33 మంది విద్యార్థులు హాజరైనారు,వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని వృధా చేయకుండా వారిలోని సృజనాత్మకతను,నైపుణ్యాలను వెలికి తీసేందుకు కంప్యూటర్ బేసిక్స్ తో పాటు యోగ కార్యక్రమాలు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేసవి శిబిరం ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఆర్.రాజగంగారెడ్డి తెలిపారు.ఈ క్రమంలో ఉపాధ్యాయులు బుర్ల రమేష్, ఇన్స్టక్చర్స్ శ్రీకాంత్,సి.ఆర్.పి సత్యం,ఈశ్వర్ మధ్యాహ్నభోజన నిర్వాహకులు కుడేల్లి వెంకటేశం పాల్గొన్నారు.

## ఇంటర్ విద్య విలీనం ఆపినందుకు అభినందనలు

**నిజామాబాద్ విద్యావిభాగం మే 11: జనం సాక్షి**




రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్ లో కలపకుండా, ఉన్నత విద్యా నుండి తొలగిస్తే వచ్చే ఇబ్బందులను తెలియజేసి, ఆ ప్రక్రియను ఆపడానికి రాష్ట్ర ఇంటర్ విద్య ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి కి చేసిన కృషిని అభినందిస్తూ సోమవారం ఇంటర్ విద్య కార్యాలయం వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఇంటర్ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు నర్సయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్ విద్యా ను స్కూల్ ఎడ్యుకేషన్ లో కలిపితే వచ్చే ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు, ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారని నర్సయ్య తెలిపారు. ఈ సంవత్సరం యధావిధిగా అడ్మిషన్ లు నిర్వహించేందుకు అనుమతించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్, జిల్లా ప్రిన్సిపాల్ ల సంఘం నాయకులు, లైబ్రేరియన్ సంఘం ప్రతినిధులు, బోధనేతర సిబ్బంది సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎండాకాలం మండుతున్న చికెన్ ధరలు

**ముస్తాబాద్ మే 11( జనం సాక్షి)**
చికెన్ ధరలు రోజు రోజుకు ప్రియం అవుతున్నాయి,వారం రోజుల నుంచి పరిశీలిస్తే ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి, ఈనెల 6న, స్కిన్ తో కిలో 260 ఉండగా.. ప్రస్తుతం 360 కి చేరింది, దీంతో కోడి మాంసం ప్రియులు చికెన్ కొనాలంటే జంకుతున్నారు. కిలో, రెండు కిలోలు తెచ్చుకుని తినేవారు అరకిలో తో సరిపెట్టు కుంటున్నారు. మటన్ తో పోలిస్తే మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువ గా చికెన్ ను ఇష్టపడ తారు.ధరలు అందుబాటులో ఉం టాయన్న కారణంతో సామాన్యులు ఎక్కు వగా చికెన్ ను కొను గోలు చేసి తింటారు. ప్రస్తుత కాలంలో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఎండలు. పెళ్లిళ్ల సీజన్. సరఫరా తగ్గుదల. వెరసి చికెన్ ధరలు భారీగా పెరిగాయి. రోజురోజుకూ చికెన్, మటన్ ధరలు పెరుగు తుండటంతో సామా న్యులు కొనాలా వద్దా అన్న పరిస్థితి నెలకొంది. తాజా చికెన్ రేట్ల ప్రకారం. ఫామ్ రేట్ లైవ్ బర్డ్ (కోడి కిలో) 170 నుంచి 180 ఉంది. డ్రెస్సెడ్ చికెన్ రూ.320 -330 వరకు అమ్ముతున్నా రు. స్కిన్ లెస్ రూ.350 నుంచి రూ.360 వరకు విక్రయిస్తున్నారు. గుడ్లు డజన్ రూ.72 నుంచి 75 వరకు విక్రయిస్తున్నారు. చికెన్ రేట్లు భారీగా పెరగడంతో మాంసం ప్రియులు కోడి మాంసం కొనాలంటే కొనలేని పరిస్థితి.ప్రస్తుతం ధరలు జూన్ నెలాఖరు వరకు ఇలానే ఉంటాయని వ్యాపారులు చెబుతు న్నారు.వేసవి తీవ్రత కారణంగా కోళ్ల మరణాలు పెరగడం, ఫారాల్లో ఉత్పత్తి తగ్గ డం వల్ల మార్కెట్‌లో సరఫరా తగ్గిందని, మరోవైపు పెళ్లిళ్లు, ఫంక్షన్లు, హోటళ్ల నుంచి డిమాండ్ పెరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగా యని చెబుతున్నారు.

## మొరం అక్రమ తవ్వకాలపై చీత ఫోర్స్ మెరుపు దాడి పోలీస్ కమిషనర్ వెల్లడి

### రెండు జె సి బి యంత్రాలు , 13 ట్రాక్టర్లు స్వాధీనం

**నిజామాబాద్ క్రైం మే 11: జనం సాక్షి**
సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య ఆదేశాల మేరకు , జిల్లాలో జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలు మరియు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు వరుస తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అఊ ఏసీపీ ఇన్‌చార్జ్ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీత ఫోర్స్ సిబ్బంది ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామంలోని పెద్ద వాగు ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు, అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు నిర్వహిస్తూ రవాణా చేస్తున్న వాహనాలను గుర్తించారు. వెంటనే మెరుపు దాడి నిర్వహించి, తవ్వకాలకు ఉపయోగిస్తున్న 2 జేసీబీ యంత్రాలు మరియు మొరం రవాణాకు వినియోగిస్తున్న 13 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, సహజ వనరులు దెబ్బతింటాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా వాగులు, చెరువులు మరియు పరిసర ప్రాంతాల పర్యావరణ సమతుల్యతకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.స్వాధీనం చేసుకున్న వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల కోసం ధర్పల్లి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కి అప్పగించారు. సంబంధిత వ్యక్తులపై మైనింగ్ మరియు ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.జిల్లా వ్యాప్తంగా అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన వంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా ఇలాంటి విషయాలపై సమాచారం అందించాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.



# దళిత యువకుడి హత్య కేసు చేదన

**○ ముగ్గురు నిందితుల అరెస్ట్..**

**○ టాటా జెస్ట్ కారు.. మొబైల్ ఫోన్లు స్వాధీనం..**

**○ టూటౌన్ పోలీసులు చాకచక్యంగా కేసు పరిష్కారం..**




**గోదావరిఖని, జనంసాక్షి:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి గోదావరిఖని టూటౌన్ పోలీసులు దళిత యువకుడు జూల వంశీ హత్య కేసును వేగంగా చేదించారు.ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావుతో కలిసి నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడించారు.ఈ కేసును గోదావరిఖని ఏసీపీ పర్యవేక్షణలో గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఫిర్యాదు దారు సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జూల శంకరమ్మ తన కుమారుడు జూల వంశీ గత నెల 29న ఇంటి నుండి వెళ్లి కనిపించకుండా పోయాడని ఈ నెల 01న గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు సీడీఆర్, మొబైల్ కాల్ వివరాలను పరిశీలించగా ఏ1 అలేఖ్య, ఏ2 నీలం నవీన్, ఏ3 బుర్ర భాస్కర్‌పై అనుమానం వ్యక్తమైంది.వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురు కలిసి వంశీని హత్య చేసినట్టు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు.మృతుడు జూల వంశీ, అలేఖ్య పదో తరగతి చదువుతున్న సమయంలో ప్రేమించుకున్నారన్నారు.అనంతరం అలేఖ్య, నీలం నవీన్‌ను ప్రేమ వివాహం చేసుకుందని పేర్కొన్నారు.అయితే 2025 ఫిబ్రవరిలో జరిగిన పదో తరగతి గెట్ టు గెదర్ కార్యక్రమం అనంతరం వంశీ, అలేఖ్య మొబైల్ నంబర్ తీసుకుని ప్రేమ పేరుతో తరచూ ఫోన్‌కాల్స్,మెసేజ్‌లు చేస్తూ వేధింపులకు గురి చేశాడన్నారు.అంతేకాకుండా వంశీ మూడుసార్లు అలేఖ్య ఫ్లాట్‌కు వెళ్లి గొడవలకు దిగగా, నీలం నవీన్, బుర్ర భాస్కర్ అక్కడికి చేరుకుని అతడిని మందలించి పంపించినట్టు విచారణలో వెల్లడైందన్నారు.ఈ విషయాలను అలేఖ్య తన భర్త నవీన్, భాస్కర్‌కు తెలియజేయడంతో ముగ్గురు కలిసి వంశీని హత్య చేయాలని కుట్ర పన్నారు.పథకం ప్రకారం అలేఖ్య భాస్కర్ ఫోన్ చేసి వంశీని హైదరాబాద్‌కు రప్పించారు.గత నెల 30న వంశీ ముందుగా అలేఖ్య ఫ్లాట్‌కు వెళ్లగా అక్కడి నుండి ముగ్గురు కలిసి భాస్కర్‌కు చెందిన టాటా జెస్ట్ కారులో అతని ఫ్లాట్‌కు వెళ్లారు.అదే సమయంలో నీలం నవీన్‌పై అనుమానం రాకుండా ఉండేందుకు తాను డ్యూటీకి వెళు తున్నానని చెప్పినట్టు విచారణలో వెల్లడైందన్నారు. తర్వాత భాస్కర్ తన ఫ్లాట్‌లో వంశీకి మద్యం తాగించి గొడవకు దిగాడన్నారు.అనంతరం ముందుగానే సిద్ధం చేసుకున్న కత్తితో వంశీ ఛాతి, మెడ భాగాల్లో విచక్షణారహితంగా పొడవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.హత్య అనంతరం అలేఖ్య ఫోన్ ద్వారా నీలం నవీన్‌కు సమాచారం ఇవ్వగా, నవీన్ అక్కడికి చేరుకుని భాస్కర్‌తో కలిసి గదిలోని రక్తపు ఆనవాళ్లను లైజాల్‌తో శుభ్రం చేసినట్లు వెల్లడైందని ఏసీపీ తెలిపారు.అనంతరం భాస్కర్, నవీన్ కలిసి మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లు.. మ్యాట్‌లో చుట్టి కారులో ఉంచారు.తరువాత భాస్కర్ ఒక్కడే టాటా జెస్ట్ కారు నంబర్ టీఎస్07యూహెచ్-6753లో మృతదేహాన్ని మంథని మండలం గాడుదులగండి ప్రాంతానికి తీసుకెళ్లి రోడ్డు పక్కనున్న లోయలో పడవేసినట్టు ఏసీపీ తెలిపారు.



## విద్య సామాజిక బాధ్యతను పెంపొందిస్తుంది..

### కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా..

**గోదావరిఖని, జనంసాక్షి:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం సోమవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎడ్యుకేషన్ వీక్ ఖని కళాశాలలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశానికి జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ గీతంతో స్వాగతం పలికి శుభారంభం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాలకు మధ్య సామాజిక బాధ్యతను పెంపొందిం చేందుకు రూపొందించిన కార్యక్రమమే ఈ విద్యా వారోత్సవాలన్నారు.ఏడు రోజుల పాటు నిర్వహించే యాక్టివిటీస్-యాక్షన్ ప్లాన్ గురించి విద్యార్థులకు వివరించారు. (డే-1 ప్రారంభ సమావేశం, డే-2 అకడమిక్ అండ్ వెల్నెస్ యాక్టివిటీస్, డే-3 విలేజ్ లెవెల్ అకడమిక్ కాంక్లేవ్, డే-4 పేరెంట్ టీచర్ మీటింగ్, డే-5 మన గ్రంథాలయ జ్ఞానోత్సవం, డే-6: ఏఐపై అవగాహన కార్యక్రమం,డే-7ముగింపు సమావేశం,బహుమతుల ప్రదానోత్సవం), తదనంతరం వైశాలి, నవ్యా, రోహిత్ బృందాలు నృత్య ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఏ.సాంబశివరావు, ఇతర అధ్యాపకులు జి.సుబ్బారావు,సవితా, శంకరయ్య, ఎం.నరేష్, తిరుపతి, రామకృష్ణ, వి.నరేష్, సతీష్, ఉషారాణి, సుమలత, సూపరింటెం డెంట్ శ్రీనివాస్,అధ్యాపకేతర సిబ్బంది శ్రీలత, జలజ, సతీష్, షకూర్, కలిమ్, కోటేశ్వరరావు,అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజావాణి కి విశేష స్పందన

**ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాది దారుల నుండి 30 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్**

**నిజామాబాద్ క్రైం మే 11: జనంసాక్షి**
ఈ రోజు నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ మరియు సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.వివిధ ఫిర్యాదు లకు సంబందించిన 30 ఫిర్యాదు లను స్వీకరించారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**రుద్రంగి మే 11 (జనంసాక్షి)** రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వారికి నూతన వస్త్రాలు అంద జేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక పేద కుటుంబా లకు సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చేలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఎర్రం గంగా నరసయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పాత నేరస్తుల తీరు మారకుంటే పీడీ యాక్ట్ కంటిన్యూ

**- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు..**

**- హెచ్చరించిన గోదావరిఖని ఏసీపీ రమేష్..**

**- పాత నేరస్తులకు యూరిన్..నార్కోటిక్ పరీక్షలు..**




**గోదావరిఖని, జనంసాక్షి:**
పాత నేరస్తుల తీరు మారకుంటే పీడీ యాక్ట్ కంటిన్యూ చేస్తామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ హెచ్చరించారు.సోమవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గోదావరిఖని వన్‌టౌన్, టూటౌన్, రామగుండం సర్కిల్ పరిధిలోని పాత నేరస్తులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడవడిక కలిగిన వారితో కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.రౌడీషీటర్ల నేరచరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం,ఉద్యోగ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ పనులు ముగించుకున్న తరువాత నేరుగా ఇంటికి వెళ్లాలని,అనవసరంగా రోడ్లపై తిరగవద్దని సూచించారు.ఎవరినైనా ఇబ్బంది పెట్టినట్టు ఫిర్యాదు అందితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.భవిష్యత్తులో నేరాల్లో పాల్గొంటే చట్టంలోని సంబంధిత యాక్టుల ప్రకారం శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి వస్తుందని ఏసీపీ హెచ్చరించారు.ఈ సందర్భంగా చాలా కాలంగా రౌడీ షీట్ ఓపెన్ అయి ఉండి, గత పది సంవత్సరాలుగా ఎలాంటి నేరాల్లో పాల్గొనకుండా సత్ప్రవర్తనతో ఉన్న వ్యక్తులను గుర్తించి వారి రౌడీషీట్లను తొలగించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.సైకియాట్రిస్ట్ డాక్టర్ రవివర్మ మాట్లాడుతూ నేరప్రవర్తనకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన జీవితం గడపాలని సూచించారు.కోప నియంత్రణ,మానసిక ఒత్తిడి,సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడంతో పాటు కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. సమాజంలో మంచి పౌరులుగా మారి ప్రశాంత జీవనం గడపాలని డాక్టర్ రవివర్మ తెలిపారు.గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్లకు యూరిన్ టెస్ట్ ద్వారా నార్కోటిక్ పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షల్లో మత్తు పదార్థాల వినియోగం నిర్ధారణ అయిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేయనున్నట్టు పోలీసులు తెలిపారు.మత్తు పదార్థాల బారిన పడిన వారిని చెడు అలవాట్ల నుండి దూరంగా ఉంచేందుకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు అవసరమైతే డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందించే చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలోద్దిన్, రామగుండం సీఐ కృష్ణకుమార్,రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవివర్మ, సబ్‌డివిజన్ ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

- సాయి భగీరథను అరెస్ట్ చేయాలి..- విలేకరుల సమావేశంలో 'కోరుకంటి'..




గోదావరిఖని, జనంసాక్షి:

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని.. ఆయన కుమారుడు సాయి భగీరథను అరెస్ట్ చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు.గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా బీజేపీ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆయన కుమారుడు బండి సాయి భగీరథ్‌పై వచ్చిన అత్యాచార ఆరోపణ అంశం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటనపై వివిధ రాజకీయ పార్టీలు స్పందిస్తూ బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయని ఆయన కోరారు.బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని చందర్ తెలిపారు.ఫొక్సో కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు బండి సాయి భగీరథ్‌ను అరెస్ట్ చేయకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. గతంలో ఇతర సంఘటనలపై తీవ్రంగా స్పందించిన బీజేపీ నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం పాటించడం ఎందుకని ప్రశ్నించారు.పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని నిందితుడిని అరెస్ట్ చేయాలని చందర్ డిమాండ్ చేశారు.మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, చట్టం ముందు ఎవ్వరూ పెద్దవారు కాదని పేర్కొన్నారు.అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం మహిళల భద్రత అంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని టీఆర్ఎస్ పార్టీ కోరుతుందన్నారు.బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని చందర్ హెచ్చరించారు.తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా చందర్ అభిప్రాయపడ్డారు.ఈ విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపు అయిలయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్‌రావు, మాజీ కార్పొరేటర్లు బొడ్డు రవీందర్, కవితసరోజిని, నాయకులు సట్టు శ్రీనివాస్, తిమోతి, తదితరులు పాల్గొన్నారు.

## పీవీ రావు ఆశయాలను కొనసాగిస్తాం..

**గోదావరిఖని, జనంసాక్షి:**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో పీవీ రావు 74వ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి హాజరై పివి రావు ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు.చంద్రబాబు చేసిన కుట్రలో భాగమే వర్గీకరణ అన్నారు.2024 వరకు మామూలుగా అన్ని రంగాలు నష్టపోయాయన్నారు. మాల మహానాడు సంఘాన్ని ఏర్పాటు చేసి సుప్రీం కోర్టు దాకా పోరాడి ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కాదని కేసు కొట్టివేతలో పివి రావు కీలక పాత్ర పోషించారన్నారు. మాలలు 30 సంవత్సరాల తర్వాత బిజెపి, మందకృష్ణ మాదిగ,ఇతర అగ్రవర్గ రాజకీయ పార్టీల కుట్ర పన్ని సుప్రీంకోర్టు నుంచి తీర్పు ఇప్పించారన్నారు.తీర్పు చట్టబద్ధత తెలిసి కూడా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన దాన్ని రద్దు చేసే వరకు కొట్లాడుతామని అన్నారు.ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయిస్తామన్నారు.మాల మహానాడు ఆఫ్ ఇండియా పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనిలో జంబో కమిటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవి లక్ష్మీనరసయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండా కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడుగా జక్కుల నారాయణ, పెద్దపల్లి జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గనల్లి త్రివేణి, రామగుండం మున్సిపల్ మహిళా అధ్యక్షురాలుగా సంభోది సుశీల, జిల్లా యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ కోలా ప్రేమకుమార్‌కు డాక్టర్ పసుల రాంమూర్తి నియామక పత్రాలు అందచేశారు.ఈ కార్యక్రమంలో కాసర్ల యాదగిరి, గుమ్మడి కుమారస్వామి, పద్మారావు, మోహన్, దాసరి ఎల్లయ్య, పొనగంటి రాజయ్య, కోలా శ్రీనివాస్,అరె దేవకర్ణ, కారంగుల శ్రీశైల,మద్దెల శ్రీనివాస్ ఎరుకల నాగరాజు, సోగాల రవి, మార్టిన్ లూథర్, తదితరులు పాల్గొన్నారు.కాగా, కొండ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు.



### ఎస్‌హెచ్ఆర్ చట్టం మండల వైస్ ప్రెసిడెంట్‌గా క్రాంతికుమార్

**అంతర్గాం, జనంసాక్షి:**

సమాచార హక్కు రక్షణ చట్టం (2005) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఉప్పుల కిరణ్‌కుమార్ రామగుండం మండలం వైస్ ప్రెసిడెంట్‌గా పల్లె క్రాంతికుమార్‌ను సోమవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పల్లె క్రాంతికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పెద్దపల్లి జిల్లా ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, రామగుండం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కూకట్ల శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ బాధ్యతలను నూరు శాతం పారదర్శకంగా నిర్వహిస్తానని తెలిపారు.

### నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

**రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ**




**గోదావరిఖని, జనంసాక్షి:**

రామగుండం కమిషనరేట్ పరిధిలోని పీకే రామయ్యకాలనీలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీపీసీ సీఐ కృష్ణ వాహనాల తనిఖీలు చేపట్టి, పత్రాలు లేని 65 బైక్‌లు, 3 ఆటోలు, 1 కారుపై చర్యలు తీసుకున్నారు.హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వాహన పత్రాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలపై జాగ్రత్తలు సూచిస్తూ, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు ఇవ్వాలని కోరారు.ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ-2 అఫ్జలోద్దీన్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, లచ్చన్న, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణాలు పోయాక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగిస్తారా

### లీగల్ ప్రొటెక్షన్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీ హరీష్



**ఎల్లారెడ్డిపేట, మే 11, (జనంసాక్షి) :**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ముష్కం విజయ్ గౌడ్ కుటుంబం గత 15 సంవత్సరాలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నీడలో ప్రాణభయంతో జీవిస్తోంది. ఇంటికి ఒక గజం దూరం స్లాబ్‌కి జానెడు దూరంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ డి.పి. పైన రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్‌కి 100 కెవిఎల కెపాసిటి కలదు. ప్రమాదకరంగా ఉన్న ఈ ట్రాన్స్ఫార్మర్‌ల కారణంగా చిన్నపిల్లలు, మహిళలు ఉన్న ఆ కుటుంబం ప్రతి క్షణం ఆందోళనతో గడుపుతోంది. గల్ఫ్ దేశంలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న విజయ్ గౌడ్ నా పిల్లలకు, నా భార్యకు ఏ క్షణంలోనైనా ప్రమాదం జరుగుతుందేమో అనే భయంతో మానసిక వేదన అనుభవిస్తున్నారు. గత 15 సంవత్సరాలుగా ప్రజాప్రతినిధులకు, విద్యుత్ శాఖ అధికారులకు, సంబంధిత యంత్రాంగానికి ఎన్నోసార్లు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని రాష్ట్ర మానవ హక్కుల సంఘం యూత్ జనరల్ సెక్రటరీ హరీష్ తీవ్రంగా ఖండించారు. వర్షాకాలం విద్యుత్ లోపాలు, స్పార్కింగ్ వంటి పరిస్థితుల్లో ఎప్పుడు ఏ విషాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శలు, హామీలు ఇవ్వడం వల్ల ప్రాణాలు తిరిగి రావని, ఒక అమాయక కుటుంబం ప్రమాదంలో పడకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అత్యంత ప్రమాదకర పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర లీగల్ ప్రొటెక్షన్ హ్యూమన్ రైట్స్ యూత్ సెక్రటరీ మారుపాక హరీష్ వెంటనే స్పందించి ఎన్‌డిపిసిఎల్, ఎల్లారెడ్డిపేట ఏఈఈ, ఏడీఈతో మాట్లాడి వినతిపత్రం సోమవారం అందజేశారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో అధికారుల నిర్లక్ష్యం అసలు సహించరానిది. ఏదైనా ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత విషయంలో అధికారులదే అవుతుందని హెచ్చరించారు. అధికారిక యంత్రాంగం ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన స్పందించి ముష్కం విజయ్ గౌడ్ ఇంటి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే సురక్షిత ప్రదేశానికి తరలించి కుటుంబానికి రక్షణ కల్పించాలని మారుపాక హరీష్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమ్ యూత్ చీఫ్ సెక్రటరీ మిరిదొడ్డి అనిల్, సెక్రటరీ మారుపాక అజయ్‌లు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఇంటింటి జనాభా సర్వే



**ఎల్లారెడ్డిపేట, మే 11, (జనంసాక్షి) :**

ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో సోమవారం భారత జనాభా గణన 2027లో భాగంగా మొదటి దశ ఇండ్ల ఘనంగా లెక్కింపులో భాగంగా ఎనీమరేటర్లు, సూపర్వైజర్లు ఫీల్డ్ వర్క్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎనీమినేటర్లు వారికి కేటాయించిన హెచ్‌ఎల్‌బి ఇండ్ల బ్లాక్‌ను సందర్శించి నంబరింగ్ వేయడం ప్రారంభించడం జరిగింది. వారికి కెటాయించిన హెచ్‌ఎల్బి సరిహద్దులను తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అడిషనల్ చార్జ్ ఆఫీసర్, ఎంపిడిఓ సత్తయ్య, సెన్సస్ సూపర్వైజర్ తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండగ శాంతియుతంగా జరుపుకోవాలి..

### సిఐ వెంకటేష్



**ఎల్లారెడ్డిపేట, మే 11, (జనంసాక్షి) :**

రాబోయే బక్రీద్ పండుగను శాంతియుత వాతవరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్లారెడ్డిపేట సిఐ వెంకటేష్ అన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం సిఐ వెంకటేష్, ఎస్ఐ రాహుల్‌రెడ్డిలు ముస్లీం నాయకులతో పీస్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంతో సిఐ వెంకటేష్ మాట్లాడుతూ పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మరింత పటిష్ఠం చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని, వధశాలలు అనుమతుల ప్రకారమే నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆవుల వధను పూర్తిగా నిషేదించామన్నారు. పశువుల రవాణా పరిమితంగా, నిబంధనలకు లోబడి ఉండాలని స్పష్టం చేశారు. ఏదైన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అనాధిగా వస్తున్న హిందూ, ముస్లీం ఐకత్యను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో మండల ముస్లీం నాయకులు షాదుల్లా, సాహెబ్, షేక్ గౌస్, జహంగీర్, ఆయూబ్, సయ్యద్ లాల్ మహ్మద్, ఇర్ఫాన్, చాంద్‌పాష, డాక్టర్ హైమద్, లతీఫ్, డిలర్ బాబా, జబ్బార్, ఫోటో స్టూడియో షాదుల్, ముస్తాక్‌లు పాల్గొన్నారు.

# సామాన్యుడికి ఒక న్యాయం కేంద్రమంత్రి కొడుకు ఒక్క న్యాయమా

**బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సురేందర్ రావు డిమాండ్**



**ముస్తాబాద్ మే 11 (జనం సాక్షి)**

చట్టం ఎవరికి చుట్టం కాదు తప్పు చేసిన వ్యక్తి కటకటాల పాల్ కావాల్సిందే సామాన్యునికి ఒక న్యాయం కేంద్ర మంత్రి కొడుకు ఒక న్యాయమా ఒక అమ్మాయిపై జరిగిన అరాచకాన్ని ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లు ఎవరిస్తుంది దీన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ రావు కార్యాలయంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారునిపై నమోదైన పోక్స్ కేసులో పోలీసులు ఏవరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఇప్పటికీ నిరుతుడిని అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తుందని. అనుమానం వ్యక్తం చేస్తూ సామాన్యుడు తప్పు చేస్తే పోలీసులు వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపిస్తారు. కేంద్రమంత్రి కొడుకు తప్పు చేసినా పట్టించుకోవడం చాలా బాధాకరమైన విషయం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని బాధితురాలకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, చెవుల మల్లేష్ యాదవ్, శీలం స్వామి, ముక్క మల్లయ్య, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# నిజామాబాద్ నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రశాంతం

○నిజామాబాద్ రూరల్ నుంచి కల్లెడ అశోక్ కు అవకాశం

○కార్పొరేషన్ సమావేశ మందిరంలో కొనసాగిన ఎన్నిక ప్రక్రియ

○ఐదుగురు కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక




**నిజామాబాద్ మున్సిపాలిటీ మే 11 జనంసాక్షి :** నిజామాబాద్ నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు ఐదుగురు సభ్యులను కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నిక ద్వారా ఎంపిక చేశారు. కాగా మొత్తం 58 దరఖాస్తులు రాగా అందులో ఐదుగురికి కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం దక్కింది. ఇందులో ఇద్దరు ముస్లిం మైనారిటీలు, 1 సిక్కు మైనారిటీగా ఉండగా మరో ఇద్దరు బీసీ జనరల్ కు కేటాయించారు. ఇందులో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి బోర్గం (పి)డివిజన్ నంబర్ 5 నుంచి బీసీ జనరల్ విభాగంలో కల్లెడ అశోక్ కు కో ఆప్షన్ సభ్యుని పదవి వరించింది. దీంతో స్థానిక నిజామాబాద్ రూరల్ నియోజవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అశోక్ ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల వారికి అవకాశాలు కల్పిస్తుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు.

**కల్లెడ అశోక్ నేపథ్యం ఇలా..**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం బోర్గాం (పీ) గ్రామానికి చెందిన కల్లెడ అశోక్ 2002 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే 2002-2007 మధ్య కాలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న బోర్గాం (పీ) గ్రామానికి వార్డు మెంబర్ గా, అదేవిధంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించడంతో పాటు జిల్లా రజక సంఘం ఐక్యవేదికలో 2012 మధ్య కాలంలో కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. దీంతో ఆయన సేవలకు గుర్తింపుగా సోమవారం జరిగిన నగర పాలక సంస్థ ప్రత్యేక సమావేశంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలో ఆయన్ను నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. దీంతో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఐటీఐ, ఏటిసి లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

○ రామగుండం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఈ. సురేందర్

○ మే 14 నుండి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

○10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు

**పెద్దపల్లి,మే 11(జనంసాక్షి) :**
జిల్లాలోని రామగుండం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఏటీసీలలో 2026-27 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు రామగుండం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, ఈ. సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, టీసీ తదితర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మే 14, 2026 నుండి జూన్ 8, 2026 వరకు ఐటిఐ, తెలంగాణ వెబ్‌సైట్ ఎచ్ టి టి పి ఎస్/ఐటిఐ తెలంగాణ.గౌ ఇన్ ద్వారా రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2026 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని,అభ్యర్థులు తమ సొంత మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్,ఈ-మెయిల్ ఐడీని ఐటీఐ పూర్తి అయ్యే వరకు మార్చరాదని సూచించారు. మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దయ్యే అవకాశం ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ సంఖ్యలో ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని, జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కోర్టు కేసు విచారణకు హాజరైన విజయ రమణారావు



**సుల్తానాబాద్,మే 11(జనంసాక్షి) :** చివరి ఆయకట్టు వరకు ఎస్సారెస్పీ సాగునీటిని అందించాలని రైతుల పక్షాన పోరాటం చేసినందుకుగాను, అప్పటి ప్రభుత్వం నమోదు చేసిన కేసుకు సంబంధించి సోమవారం,రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు,కరీంనగర్ లోని సెషన్స్ కోర్టుకు విచారణకు హాజరయ్యారు. విజయ రమణారావు తో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న విజయ రమణారావు అనుచరులు కోర్టు కేసుకు హాజరయ్యారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి**

**అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్**

**కరీంనగర్ టౌన్, మే 11 ( జనంసాక్షి)**
అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన మైనర్ బాలిక వేధింపుల కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి తక్షణమే తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా, వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాన్యులకు ఒక న్యాయం, అధికారంలో ఉన్నవారికి మరో న్యాయమా అని ప్రశ్నించారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని ఆరోపించిన ఆయన, సామాన్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కుటుంబంపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. నిందితుడి వేధింపులు, పోలీసుల ఒత్తిడిని తట్టుకోలేక బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన రాజకీయ, అధికార బలంతో కేసును ఉపసంహరించుకోవాలని బాధిత కుటుంబంపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బాధితురాలు, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తి రక్షణ కల్పించి, కుటుంబంపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు బద్రినేత, అరుణ్, కల, లత, అరుణ, శారదా, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.





# బండి సాయి భగీరత్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**పొన్నం అనిల్ కుమార్ గౌడ్**

**కరీంనగర్ టౌన్, మే 11 (జనంసాక్షి)**
మైనర్ బాలికపై జరిగిన ఘటనలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరత్‌పై నమోదైన పోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బారాసా నాయకులు సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ధర్నా నిర్వహించారు. మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పలువురు బారాసా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వ్యతిరేకంగా బారాసా శ్రేణులు నినాదాలు చేశారు. సంజయ్ డౌన్ డౌన్ అంటూ నినదిస్తూ, కళ్లుమూసుకున్న ప్రధాని నరేంద్ర మోడీ, నోటికి వేలుపెట్టి మౌనంగా ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రాలతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. మైనర్ బాలిక విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సహకరిస్తున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. నిజాయితీ ఉంటే కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు న్యాయం జరిగేంతవరకు బారాసా పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, బండి సాయి భగీరత్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీర్ షౌకత్ అలీ, నారదాసు వసంతరావు, బొంకూరి మోహన్, అన్వేష్, రవి నాయక్, సైఫ్, నయీం, సతీష్, దినేష్, రవి గౌడ్, గోడిషాల పావని గౌడ్, బత్తిని కీర్తిలతా గౌడ్, రుద్ర రాధ, అజంతా, హిమబిందు, శ్రీలత, రాజమణి, రేణుక, అరుణ తదితర బారాసా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి

○మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరపాలి

○ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



**కరీంనగర్ టౌన్, మే 11 (జనంసాక్షి)**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై 17 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో వెంటనే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 8న బాధిత కుటుంబం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు కోసం ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు కేసు నమోదు చేయకుండా, సరైన విచారణ చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఆయనను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ పూర్తి చేసి నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ, బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు కేసు నమోదు చేయకుండా భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. రాజకీయ ప్రభావంతో కేసును మేనేజ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. సామాన్య ప్రజలకు ఒకలా, రాజకీయ నేతల కుటుంబాలకు మరోలా వ్యవహరించడం తగదని, చట్టం ముందు అందరూ సమానమనే భావనతో ప్రభుత్వం వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నూనావత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు సందీప్ రెడ్డి, సాయి కృష్ణ, అజయ్, రాకేష్, అరుణ్, వినయ్, ఈశ్వర్, రిషి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- రాబోయే 15 రోజుల్లో 90% మ్యాపింగ్ పూర్తి చేయాలి
- వీవీఐపీ ,వీఐపీ, ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి







**పెద్దపల్లి,మే 11(జనంసాక్షి) :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు.జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు.స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు.జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు.ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రముఖుల పేర్లు మిస్ అయ్యాయనే సంచలన వార్తలు రాకుండా చూడాలని తెలిపారు.అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు.మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందు కు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి నియమిస్తున్నామని, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఎన్నికల విభాగం అధికారి విజయ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో

# మాతృ మరణాలపై సమీక్ష సమావేశం



**పెద్దపల్లి,మే 11(జనంసాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ తన కార్యాలయంలో సోమవారం మాతృ మరణాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇటీవల సంభవించిన ఒక మాతృ మరణంపై సమగ్ర సమీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా మాతృ మరణానికి దారితీసిన సామాజిక, ఆర్థిక, ఆరోగ్య సంబంధిత పరిస్థితులు, గర్భిణీకి అందిన వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షల స్థితి, అత్యవసర రవాణా సేవలలో ఏవైనా ఆలస్యాలు చోటుచేసుకున్నాయా అనే అంశాలను వివిధ కోణాల్లో విశ్లేషించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.మాతృ మరణాల నివారణ మరియు తల్లీ-శిశు ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. హై రిస్క్ గర్భిణీలు వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీ స్త్రీలకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు, డయాగ్నొస్టిక్ సేవలు, స్కానింగ్ సదుపాయాలు, ప్రసవ సేవలు సమర్థవంతంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నిష్ణాతులైన వైద్యులు మరియు సిబ్బంది ఎల్లప్పుడూ సేవలకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలు 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వి. వాణిశ్రీ, వైద్య అధికారులు డాక్టర్ లక్ష్మీ భవాని, మేడారం పి హెచ్ సి వైద్య అధికారి డాక్టర్ సుష్మిత, సంబంధిత సిబ్బంది మరియు మాతృ మరణ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# బహుజన కాంట్రాక్టర్ల పొట్ట కొట్టొద్దు

- జీవో 17 రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం
- బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష

**పెద్దపల్లి,మే 11(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 17తో చిన్న తరహా కాంట్రాక్టర్ల పాలిట శాపంగా మారిందని,తక్షణమే దానిని రద్దు చేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష నేతృత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ,ఎంఎస్ఎంఈ ప్రతినిధులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా గురుకుల పాఠశాలలకు నిత్యావసరాలు సరఫరా చేస్తూ,నెలకు 10 నుండి 20 వేల రూపాయల ఆదాయంతో జీవనం సాగిస్తున్న వేలాది మంది బహుజన కాంట్రాక్టర్ల పొట్ట కొట్టేలా ప్రభుత్వం ఈ కొత్త నిబంధనలు తెచ్చిందని మండిపడ్డారు. ముఖ్యంగా 20 నుండి 50 కోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ ఉండాలనే నిబంధనను చేర్చడం వల్ల స్థానిక చిన్న కాంట్రాక్టర్లు టెండర్లకు అనర్హులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా,50 లక్షల నుండి 2 కోట్ల రూపాయల భారీ అడ్వాన్సులు చెల్లించాలని కోరడం కేవలం బడా కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయడానికేనని ఆమె విమర్శించారు. జీవో 17వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు10 వేల మంది చిన్న తరహా కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని,ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానిక కాంట్రాక్టర్ల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొలుమూరి శేఖర్,బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లబెల్లి శంకర్,బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్,మహిళా కన్వీనర్ సిరవైన స్వప్న,మీడియా ఇన్చార్జి అబ్దుల్ మాలిక్,అరుణ,ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ అలువాల రాజేందర్,బీసీ జేఏసీ నాయకులు బొల్లం భూమేష్,భూమయ్య, శ్రీనివాస్,కన్నం రవి, ప్రసాద్, సంతోష్, శ్రావణ్,రఘు,రమేష్ తోపాటు వివిధ సంఘాల నాయకులు,చిన్న తరహా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

### ఆపదలో అండగా

# పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

- 80 సంవత్సరాల వృద్ధురాలుకు చికిత్స అందించి
- ప్రాణం కాపాడిన ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ వినయ్,నీ అభినందించిన సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్



**పెద్దపల్లి,మే 11 (జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణానికి చెందిన 80 సంవత్సరాల ఒక వృద్ధురాలు శనివారం రోజున తన ఊపిరితిత్తు ల్లో నీరు చేరి తీవ్రమైన ఆయాసం తో మాసివ్ రైట్ సైడెడ్ ప్యూరల్ ఎఫిషియన్ తో బాధ పడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రావడం జరిగింది. విధుల్లో వున్న డాక్టర్ మరియు పేషెంట్ మనుమడు రవి కరబుజ ,వెన్నంపల్లి వాస్తవ్యులు ఆసుపత్రి సూపరిం టెండెంట్ డా. కె. శ్రీధర్ కి విషయం చెప్పగా స్పందించిన సూపరింటెండెంట్ ఆసుపత్రిలో పని చేస్తున్న పల్మనరీ మెడిసిన్ వైద్యుడు అయిన డా. కిరణ్ కి విషయం తెలుపగా వెంటనే స్పందించి సదరు మహిళకు చికిత్స చేసి ఊపిరితిత్తులలో ఉన్న నీటిని తీసివేయడం జరిగింది. ఇప్పుడు ఆ మహిళ కోలుకొని ఆరోగ్యంగా ఉంది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా. కిరణ్ ని మరియు సహకారం అందించిన డా వినయ్ ఫిజియన్ ని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది, అదేవిధంగా పేషెంట్ బంధువులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి,మే 11(జనంసాక్షి) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం గట్టుపల్లి గ్రామానికి చెందిన బి. హన్సిక తనకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా తహసిల్దార్ కార్యాలయంలో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని, స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకునేందుకు కుల దృవీకరణ పత్రం అత్యవసరం అయినందున తనకు వెంటనే కుల ధృవీకరణ పత్రం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామపంచాయతీకి చెందిన ఆవుల వసంత తనకు ఇంటి నిర్మాణం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న అనుమతి మంజూరు చేయడం లేదని ఇంటిని నిర్మించు కునేందుకు అవసరమైన అనుమతులు మంజూరు అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగుండం నగరపాలక సంస్థకు చెందిన లింగం వెంకట్ రెడ్డి అయోధ్య నగర్ పరిధిలో ఇంటి యజమాని రేకుల ఇండ్లు నిర్మించుకుని దానికి తగిన పన్ను మాత్రమే చెల్లిస్తున్నారని, 6 సంవత్సరాల క్రితం ఆ రేకులను తొలగించి స్లాబ్ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ పాత రేకుల ఇంటి పన్ను మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నందున దానిని పరిశీలించి కొత్త ఇంటికి పన్ను పెనాల్టీతో సహ వసూలు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపుల ఎదుగుదలను అడ్డుకునే కుట్రలు

**○బండి సంజయ్ పై దుష్ప్రచారం వెనుక రాజకీయ కుతంత్రాలు.**

**○బీసీ బిడ్డ ఎదుగుదలను ఓర్వలేక టార్గెట్ చేస్తున్నారు..**

**○ విలేఖర్ల సమావేశంలో మున్నూరు కాపు నాయకులు**



**కరీంనగర్ బ్యూరో, మే 11(జనంసాక్షి) :** తెలంగాణలో మున్నూరు కాపు సమాజం రాజకీయ, సామాజికంగా ఎదుగుతున్న వేళ ఆ వర్గాన్ని అణగదొక్కే కుట్రలు పన్నుతున్నారని మున్నూరు కాపు సంఘం నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ వర్గానికి చెందిన నాయకులు ఉన్నత స్థానాలకు ఎదగడాన్ని కొందరు ఓర్వలేక దుష్ప్రచారాలకు తెరలేపుతున్నారని జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ పటేల్, ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్ పటేల్ ఆరోపించారు. సోమవారం రోజు నగరంలోని నక్షత్ర హోటల్లో లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యంగా కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్రమంత్రి స్థాయికి ఎదిగిన కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై జరుగుతున్న ప్రచారం రాజకీయ కుట్రలో భాగమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన వివరాల్లో మున్నూరు కాపుల జనాభాను కేవలం 3.9 శాతంగా చూపించడం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని ఆరోపించారు. ఇది మున్నూరు కాపుల సామాజిక బలాన్ని తగ్గించి చూపే ప్రయత్నమని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వెనుక అగ్రవర్ణ రాజకీయ శక్తుల కుట్ర ఉందని వారు పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల నుంచి ఎదిగిన నాయకుడిని బద్నాం చేయాలనే ఉద్దేశంతో కావాలనే కొన్ని అంశాలను పెద్దఎత్తున వైరల్ చేస్తున్నారని ఆరోపించారు. గత డిసెంబర్లో జరిగిన అంశాన్ని ఇప్పుడు ప్రధాని సభకు ముందు తెరపైకి తీసుకురావడం యాదృచ్ఛికం కాదని, ఇది స్పష్టమైన రాజకీయ కుతంత్రమని వ్యాఖ్యానించారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టాలు, న్యాయ వ్యవస్థ ఉన్నాయని, చట్టపరంగా విచారణ జరగాలని తప్ప, నిరూపణలు కాకముందే సోషల్ మీడియాలో వ్యక్తిత్వాన్ని దెబ్బ తీయాలని చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు. తన కుమారుడు తప్పు చేసి ఉంటే చట్టపరమైన చర్యలకు తాను వ్యతిరేకం కాదని స్వయంగా బండి సంజయ్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లోనూ ఆయనను టార్గెట్ చేస్తూ, దుష్ప్రచారం చేయడం వెనుక రాజకీయ ద్వేషమే కారణమని పేర్కొన్నారు.కార్యకర్త స్థాయి నుంచి కార్పొరేటర్గా, అక్కడి నుంచి ఎంపీగా, అనంతరం కేంద్ర సహాయ మంత్రిగా ఎదిగిన బండి సంజయ్ రాజకీయ ప్రయాణం బీసీ వర్గాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అలాంటి నాయకుడి ఎదుగుదలను కొందరు జీర్ణించుకోలేక వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని విమర్శించారు. మున్నూరు కాపులంతా బండి సంజయ్కు అండగా నిలుస్తారని, ఆయన పై జరుగుతున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

మున్నూరు కాపుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కరీంనగర్కు చెందిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు వర్గానికి చెందిన ఆకుల నరసయ్యకు వ్యవసాయ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వడాన్ని స్వాగతించారు. సమాజానికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించాలని, మున్నూరు కాపుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో తిరుమలి రాజేశం పటేల్, ఆకుల యాదయ్య పటేల్, అనురాసు కుమార్, బొమ్మ రాతి సాయికృష్ణ పటేల్, బండి ప్రశాంత్ పటేల్, కళ్యాడపు నరేష్ పటేల్, మ్యాడం శివకాంత్ పటేల్, వెంకటేశ్వర్లు పటేల్, నేతికుంట అనుప్ పటేల్, నరేందర్ పటేల్, అమర్ పటేల్ పాల్గొన్నారు.



# ప్రభుత్వం పాఠశాలలో విద్య వారోత్సవాల కార్యక్రమలు..

**పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటిన సర్పంచ్ సుధాటి రవీందర్ రావు**

**ముత్తారం మే 11(జనంసాక్షి):** ముత్తారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర విద్య వారోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ సుదాటి రవీందర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వారం రోజులపాటు జరిగే విద్య వారోత్సవాలలో పాఠశాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు,వేసవి శిబిరాల నిర్వహణ,అభివృద్ధి పనులు,పరిసరాల పరిశుభ్రత,పదవ తరగతి ప్రత్యేక తరగతులు,సర్పంచులతో వర్క్ షాప్,పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు,బడిబాట కార్యక్రమాలు, గ్రంథాలయ,సాంస్కృతిక దినోత్సవలు,విద్యా విజయోత్సవం వంటి అంశాలపై వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అయన సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆయన మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మాదేవి, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## సెన్సెస్ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాస్



**బోధన్, మే 11 (జనంసాక్షి) :** సాలూర మండలం సాలంపాడు, సాలంపాడు క్యాంపు గ్రామాలలో సోమవారం నుండి ప్రారంభమైన సెన్సెస్ సర్వేను సాలూర మండల పరిషత్ అభివృద్ధి అధికారి హెచ్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, అధికారులు గృహ సందర్శన సమయంలో ప్రజలతో మర్యాదపూర్వక వాతావరణంలో సర్వేను నిర్వహించాలన్నారు. ఇంటి యజమాని సైతం సెన్సెస్ నిర్వహించే అధికారులకు తమ పూర్తి సహకారాన్ని అందించాలని అప్పుడే ప్రభుత్వం ఆశించిన ఆశయం నెరవేరుతుందన్నారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రజలు నిక్కచ్చిగా తమ కుటుంబ వివరాలను సర్వేలో రూపొందించిన అంశాలకు అనుగుణంగా అధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. నేటి నుండి జూన్ 6 వరకు ఈ సర్వే కొనసాగుతుందని అందువల్ల మండలం నుండి గ్రామాల ప్రజలు తమ కుటుంబ వివరాలను సర్వే అధికారులకు వివరించాలన్నారు. వ్యక్తిగత సమాచారం, పాన్ నంబర్, బ్యాంకు అకౌంటు నంబరు, ఓటిపి వంటి అంశాలు ఈ సర్వేలో ఉండవనే విషయాన్ని ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఎంపీడీవో వెంట సాలంపాడు పంచాయతీ కార్యదర్శి గొట్టుముక్కల హరిత ఉన్నారు.



# బోధన్ ఆర్డీవోగా ఎం విజయ కుమారి



**బోధన్, మే 11 ( జనంసాక్షి )** బోధన్ ఆర్డీవోగా ఎం విజయ కుమారి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఏప్రిల్ 25 న పదోన్నతి పొంది బదిలీ పై వెళ్లగా, నిన్నటి వరకు ఇంచార్జ్ ఆర్డీవోగా నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ కొనసాగారు. ఈ మేరకు సోమవారం రాజేంద్ర కుమార్ నుండి బోధన్ ఆర్డీవోగా ఎం విజయ కుమారి బాధ్యతలను స్వీకరించారు. ఎం. విజయ కుమారి, డిప్యూటీ కలెక్టర్ ఇదివరకు హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవేజ్ బోర్డు లో విధులు నిర్వహించి, ఇప్పుడు బోధన్ ఆర్డీవోగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. కాదా నేడు నిర్వహించిన సమీక్ష సమీక్ష సమావేశంలో బోధన్ ఆర్డీవో ఎం విజయ కుమారి బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల తహసీల్దార్ విఠల్, శ్రావణ్, శ్రీలేఖ ఆర్డీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## సాలూర జిల్లా పరిషత్ పాఠశాలలో వేసవి శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ సొక్కం లావణ్య రవి

**బోధన్, మే 11 ( జనంసాక్షి ) :** సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారంవేసవి శిబిరంను గ్రామ సర్పంచ్ సొక్కం లావణ్య రవి క్షేత్ర మీదుగా ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, పెయింటింగ్, యోగా తదితరాలు నేర్చుకొని వేసవి శిబిరాన్ని ఆనందంగా ఆహ్లాదంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగా తరగతులతో వేసవి శిబిరాన్ని ప్రారంభించడం జరిగిందని తర్వాత స్టోరీ టెల్లింగ్ ఫర్ పర్సనాలిటీ డెవలప్మెంట్ అనే అంశంపై ప్రణీత్ భగత్, డ్రాయింగ్ పెయింటింగ్ అంశంలో రవితేజ, చెస్, క్యారం ఆటలలో ఎల్లేష్ ఉపాధ్యాయులు విద్యార్థులకు మెలకువలను నేర్పించడం జరుగుతుందని అందువల్ల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. వేసే విషయంలో మీకు వచ్చే విద్యార్థులకు అల్పాహారాన్ని సైతం అందించడం జరుగుతుందని అందువల్ల విద్యార్థులు ఈ క్యాంపులో అన్ని అంశాలపై పట్టు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ సొక్కం లావణ్య రవి కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి, ప్రధానోపాధ్యాయులు రాజీ మంజూష, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, విజయలక్ష్మి, సాయిలు,అరుణ్ కుమార్, సంగీతరావు సంతోష్ కుమార్ యాదవ్, స్వామి, విజయలక్ష్మి లక్ష్మి, విఠల్, స్వర్ణకుమారి, వనజ తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు 40 మంది విద్యార్థులు వేసవి శిబిరానికి హాజరు అయ్యారు.

## ఘనంగా కామ్రేడ్ పడాల రాములు 23వ వర్ధంతి

**బోధన్, మే 11 ( జనంసాక్షి ) :** కామ్రేడ్ పడాల రాములు 23వ వర్ధంతి సోమవారం బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల పార్టీ జెండా గద్దె వద్ద రైతు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ, కామ్రేడ్ పడాల రాములు ఆనాటి రైతు కూలీ సంఘం లో పనిచేస్తూ పట్టణంలోని గల్లీలల తో పాటు మండలంలోని ఇతర గ్రామాలలో రైతు కూలీ సంఘం నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని పార్టీ పిలుపు మేరకు రైతు కూలీలను పేద ప్రజలందరినీ నాడు జరిగిన నిజాంసాగర్ నీటి కోసం, నిజాం సాగర్ ఫ్యాక్టరీ భూములను ప్లాంటేషన్ కార్మికులకు ఇవ్వాలని జరిగిన పోరాటాల్లో క్రియాశీలకంగా పని చేశారని ఆయనకు నిజమైన నివాళులని తెలిపారు. అదేవిధంగా నాటి రైతు- కూలీ సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన నక్క లింగారెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ పడాల రాములు వ్యవసాయ కూలీలకు కూలీల పెంపు కోసం , రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం, పేద, మధ్యతరగతి ప్రజలకు పాలకులు నష్టం కలిగించే విధానాలను తీసుకొస్తే వాటికి వ్యతిరేకంగా చేసిన పోరాటాలలో రైతు కూలీలను పేద ప్రజలను సమీకరించి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కష్టాలు ఎదురైనా మనో ధైర్యంతో పోరాడాడని కొనియాడారు. ఆయన లేని లోటు తీరనిదని పడాల రాములు చేసిన సేవలు మరువలేని వని అదే స్ఫూర్తితో ముందుకు పోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో (ఏ ఐ యు కె ఎస్) అఖిలభారత ఐక్య రైతు సంఘం నిజామాబాద్ జిల్లా నాయకులు పడాల శంకర్, చిన్నయ్య, శంకర్, గంగాధర్,పి.లక్ష్మి, పి.సుశీల, మోహన్, లక్ష్మణ్, బాలరాజు, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ఆరోగ్యం కొరకే నిక్షయ్ షివిర్ కార్యక్రమం

### గుంజపడుగు సర్పంచ్ దండేవేన సంధ్య భానేష్

**మంథని, ( జనంసాక్షి ) :**

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ని క్షయ్ షివిర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు మంథని మండలం గుంజపడుగు గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ తెలిపారు. గ్రామంలో పి హెచ్ సి గద్దలపల్లి వారి ఆధ్వర్యంలో నిక్షయ్ శివిర్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చెస్ట్ ఎక్స్ రే తీయడం జరిగిందన్నారు. గ్రామంలో ఎవరు టిబి తో బాధపడకూడదని గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్ ఎల్క లక్ష్మీ సదానందం, వార్డ్ సభ్యులు దేవరకొండ కోసం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ మాధురి, ఎం ఎల్ పి హెచ్ జి వైష్ణ ఏ ఎన్ ఎం యు లు పద్మ, లీల, స్వామి, ఆశ వర్కర్స్ రమాదేవి, స్వప్న, శైలజ ఆర్ రమేష్ ఎక్రే టెక్నీషియన్ పాల్గొన్నారు.

## బీఎస్పీ మంథని నియోజకవర్గ ఉపాధ్యక్షులు గా ఏట సంపత్

**మంథని, (జనంసాక్షి) :**

బహుజన సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఏట సంపత్ ను సోమవారం నియమించినట్లు ఆ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్ జనగామ రవి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆదేశాల మేరకు బహుజన్ సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఉపాధ్యక్షులు గా ఏట సంపత్ ను నియమించడం జరిగినదని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. బహుజన్ సమాజ్ పార్టీని గడపగడపకు తీసుకువెళ్లి మహనీయుల ఆశసాధనే లక్ష్యంగా ముందుకు సాగడంతో పాటు, వారు మనకు చూపిన మార్గంలో మా యొక్క ప్రయాణాన్ని కొనసాగిస్తామని ఆయన అన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా కమిటీ నాయకులకు ఈ సందర్భంగా సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.






## బోయినిపేట అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం పోషకాహారం..!

**మంథని, (జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బోయినిపేట అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు కుళ్లిపోయిన గుడ్లు, గడువు ముగిసిన పాలు పంపిణీ చేస్తున్నారంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన పోషకాహారంలో నాణ్యత లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అంగన్వాడి కేంద్రంలో ఇటీవల పంపిణీ చేసిన గుడ్లు పాడై దుర్వాసన వస్తోందని, పాల ప్యాకెట్ల గడువు తేదీ ముగిసినా వాటిని పంపిణీ చేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ ఆహార పదార్థాలు తీసుకుంటే చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోషకాహారం పేరుతో నాసిరకం వస్తువులు పంపిణీ చేయడం బాధాకరమని, సంబంధిత అధికారులు వెంటనే కేంద్రాన్ని తనిఖీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లు, పాలు మరియు ఇతర పోషకాహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి

**నిజామాబాద్ సిటీ మే 11: జనంసాక్షి**

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నూడా చైర్మన్ కేశ వేణు లతో కలిసి ఇటీవల బండి సంజయ్ కొడుకు బండి భగీరథ పై నమోదైన ఫోక్సో కేసు బాధ్యత వహిస్తూ బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా బండి సంజయ్ కొడుకు బండి భగీరత్ మైనర్ బాలికను అత్యాచారం చేసిన కారణంగా అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు అని, బండి భగీరత్ స్నేహం పేరుతో మైనర్ బాలికను పలుమార్లు తన ఫామ్ హౌస్ కు రప్పించుకొని కూల్ డ్రింకులో మత్తు మందు కలిపి అత్యాచారం చేయడంతో మైనర్ బాలిక తల్లిదండ్రులకు చెప్పి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని, దీనిపై రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి డిజిపి తో మాట్లాడి మైనర్ బాలికకు వెంటనే న్యాయం జరిగే విధంగా చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, దేశం కోసం ధర్మం కోసం అని ప్రగల్బాలు పలికే బీజేపీ నాయకులు ఎందుకు ఒక హిందూ బాలికకు అన్యాయం జరిగితే స్పందించడం లేదని, హిందూ మతం పేరుతో ఎల్లప్పుడూ మాట్లాడే బిజెపి నాయకులు హిందూ బాలిక విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారు ప్రజలకు సమాధానం చెప్పాలని నగేష్ రెడ్డి అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తన మంత్రి పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి బాలికకు న్యాయం జరిగే విధంగా అన్యాయం చేసింది కొడుకు అని చూడకుండా శిక్ష పడే విధంగా వ్యవహరించాలని నగేష్ రెడ్డి అన్నారు. నిన్న రాష్ట్రానికి వచ్చిన నరేంద్ర మోడీ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని గొప్పలు చెప్పడం జరిగిందని కానీ ఎందుకు బండి సంజయ్ కొడుకు బండి భగీరత్ చేసిన అన్యాయంపై మాట్లాడలేదు అని దీనిపై మోడీ ఏ విధంగా స్పందిస్తారో ప్రజలకు



వివరించాలని వెంటనే బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేసి విచారణకు సహకరించాలని నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మీరు రాజీనామా చేయకపోతే ఇది ఇంతటితో ఆగకుండా ప్రజల్లోకి తీసుకువెళ్లి బాలికకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం అందుకే బండి సంజయ్ స్వచ్ఛందంగా రాజీనామా చేయాలి. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులలో వాస్తవాలకు అవాస్తవాలకు తేడా తెలియకుండా స్పందించే బిజెపి నాయకులు ఒక మైనర్ బాలికపై బండి భగీరత్ చేసిన ఆకృత్యాలపై ఎందుకు స్పందించడం లేదు అని బొబ్బిలి రామకృష్ణ ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తనయుడు భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోందనీ, ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత కఠినంగా స్పందించారనీ, విచారణలో జాప్యంపై డీజీపీ సీవీ ఆనంద్ను స్వయంగా పిలిపించి వివరణ కోరారు. ఈ నెల 8వ తేదీనే ఫిర్యాదు అందినప్పటికీ నిందితులపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యం జరిగిందని ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారని. బాధితులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు అని బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. డీజీపీ సీవీ ఆనంద్ దీనిపై వివరణ ఇస్తూ ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లలో పోలీసు యంత్రాంగం నిమగ్నమై ఉండటం వల్లే ప్రక్రియ కాస్త ఆలస్యమైందని తెలపడం జరిగిందని, కేసు పూర్వాపరాలను ఆయన ముఖ్యమంత్రికి నివేదించారనీ, వివరాలు తెలుసుకున్న రేవంత్ రెడ్డి తక్షణమే ఈ ఉదంతంపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను (రాజూవఇతిజీశ్రీ ుఎజీఎబ) ?? చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా పారదర్శకంగా సాక్ష్యాలను సేకరించి నివేదిక సమర్పించాలని డీజీపీకి సూచించారని ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని అన్నారు. తన 17 ఏళ్ల కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నారంటూ ఓ తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పేట్బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితుడిపై సెక్షన్ 11 రెడ్ విత్ 12 పోక్సో చట్టంతో పాటు బీఎన్ఎస్ 74, 75 సెక్షన్లను ప్రయోగించారు. మరోవైపు ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. సదరు బాలిక తల్లిదండ్రులు తనను డబ్బుల కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ కరీంనగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ప్రతి ఫిర్యాదు ఆధారంగా ముగ్గురిపై కరీంనగర్ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బండి భగీరథ చేసిన ఆకృత్యాలకు బండి సంజయ్ బాధ్యత వహిస్తూ విచారణ పారదర్శకంగా జరిగే విధంగా చూడాలని ,కేసు విచారణ పూర్తి అయ్యే వరకు తన మంత్రి పదవికి రాజీనామా చేసి బండి సంజయ్ తన నిజాయితీ నిరూపించుకోవాలని బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి కోశాధికారి భక్తవస్తలం,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కౌడపు శరత్ కుమార్,ఎఐసిసి కో ఆర్డినేటర్ గన్ రాజ్,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి,జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజా నరేందర్ గౌడ్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవి,జగడం సుమన్,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గణేష్,ఆకుల చిన్న రాజేశ్వర్,పార్థ సారథి, కిష్ట గౌడ్ ,మాజీ వైస్ ఎంపీపీ రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

## యాష్ డైక్ నిర్మాణానికి భూసేకరణ గ్రామసభ..



గోదావరిఖని, జనంసాక్షి : ఎన్‌టిపిసి తెలంగాణ స్టేజ్-ఎఎ ప్రాజెక్ట్ యాష్ డైక్ నిర్మాణం కోసం భూసేకరణకు గ్రామసభ సోమవారం గ్రామసభ నిర్వహించారు. భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారం, ఎన్‌టిపిసి తెలంగాణ స్టేజ్-ఎఎ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (3800 మెగావాట్లు) ప్రతిపాదిత యాష్ డైక్ నిర్మాణం కొరకు చట్టబద్ధమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా సోమవారం మొఘలపహాడ్ గ్రామంలో గ్రామసభ నిర్వహించబడింది. అవసరమైన భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 5, 2024న జారీ చేయగా, సెప్టెంబర్ 13, 2024న స్థానిక వార్తాపత్రికలలో ప్రచురించారు. నిర్దేశించిన విధానంలో భాగంగా, పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, భూసేకరణ అధికారి గంగయ్య అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. సుమారు 300 మంది గ్రామస్థులు ఈ సమావేశానికి హాజరై, సేకరించిన భూములకు పరిహారం, గ్రామాభివృద్ధి, ప్రాజెక్టులో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలకు సంబంధించిన తమ ఆందోళనలు, సూచనలను పంచుకున్నారు. హాజరైన అధికారులు భూసేకరణ ప్రక్రియను వివరంగా వివరించి, ప్రభుత్వ నిబంధనలు, విధానాల ప్రకారం అన్ని వినతిపత్రాలను పరిశీలన కోసం సంబంధిత అధికారులకు పంపుతామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య; ??అంతర్‌గావ్ తహసీల్దార్ తూము రవీందర్; డీజీఎం (హెచ్‌ఆర్) ప్రవీణ్ కె. చౌదరి; కుందనపల్లి సర్పంచ్ శంకరయ్య; అంతర్‌గావ్ సబ్-ఇన్‌స్పెక్టర్ వెంకట్; పంచాయతీ కార్యదర్శి లక్ష్మి; వార్డు సభ్యులు; ఇతర స్థానిక ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.



# హనుమాన్ జయంతి ఉత్సవాల్లో మంత్రి లక్ష్మణ్

### ప్రత్యేక పూజలు మొక్కులు చెల్లింపు

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

**మల్యాల మే 11 (జనంసాక్షి)**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల రెండవ రోజు సోమవారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు,అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి లక్ష్మణ్ స్వామివారి మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో అంజన రెడ్డి మంత్రిని శాలువాతో సత్కరించారు. ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. లోక క్షేమం కోసం ఆలయం ముందు యజ్ఞశాలలో నిర్వహిస్తున్న యజ్ఞాన్ని స్వామివారి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

**ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి**
పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా దీక్షా స్వాములు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఏర్పాట్లు చూడాలని మంత్రి లక్ష్మణ్ ఈవో అంజన రెడ్డికి తెలిపారు,భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు,జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రశాంతంగా,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ దినేష్,డీఎస్పీ పురుషోత్తం రెడ్డి,సీఐ నీలం రవి, సర్పంచ్ ఆదిరెడ్డి,ఏఈఓ గుండి హరిహర్నాథ్, సూపరింటెండెంట్ సునీల్,చంద్రశేఖర్,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పెద్ద జయంతి ఉత్సవాలు



మల్యాల మే 11 (జనం సాక్షి)
తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు సోమవారం రెండవ రోజు అత్యంత వైభవంగా కొనసాగాయి. ఉదయం 9 గంటలకు వేద మంత్రోచ్చారణల నడుమ స్థాపిత దేవతారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం హోమము,సుందరకాండ పారాయణము,పంచామృత అభిషేకము, సహస్రనామార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించబడినాయి. మహానివేదన,మంత్రపుష్పము అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణము,శ్రీ అమ్మవారి కుంకుమార్చన,పుష్పాలతో సహస్రనామార్చన,వివిధ పారాయణాలు నిర్వహించారు. అనంతరం స్థాపిత దేవతారాధన, హోమము,బలిహరణము,మహానివేదన కార్యక్రమాలు వైదిక సంప్రదాయాల ప్రకారం జరిగాయి. భక్తులకు తీర్థప్రసాద వినియోగం నిర్వహించగా, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తి గీతాలు,హరికథలు,ఆధ్యాత్మిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచారి కపిందర్,ప్రధాన అర్చకులు రామకృష్ణ, వకులాభరణం రఘు,జితేందర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. వేదపండితులు పెద్దన్న శర్మ, రాజేశ్వర శర్మ,హరిబాబు శర్మ వేద మంత్రాలతో కార్యక్రమాలకు ఆధ్యాత్మిక శోభను చేకూర్చారు.



### కొలతల ప్రకారంగా ఇందిరమ్మ ఇండ్లు

# నిర్మాణం చేపట్టాలి

### పిఏసిఎస్ చైర్మన్ నాగిరెడ్డి

**పిట్లం మే 11(జనం సాక్షి)**
పిట్లం మండల పరిధిలోని చిన్న కొడపగల్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను గ్రామంలో లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలు, కొలతలు ప్రకారంగా నిబంధనల మేరకు నిర్మించుకోవాలని పిఏసిఎస్ చైర్మన్ నాగిరెడ్డి అన్నారు. గ్రామంలో మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని, ప్రభుత్వం తెలిపిన కొలతల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి బిల్లులు చెల్లించేలా కృషి చేస్తారని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలలో జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయినాథ్, జిపి సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### మానసిక స్థితి సరిగా లేక, ఒంటరితనంతో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**కథలాపూర్, మే 11(జనంసాక్షి)**
కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన మాడవేణి నవీన్ బ/నీ నరేష్, 25 సంవత్సరాలు, ముదిరాజ్ అనునతడు గత కొన్ని సంవత్సరాల నుండి మానసిక పరిస్థితి బాగాలేక గతంలో పలుమార్లు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యులు వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్లి చికిత్స చేయించినారని, అదే క్రమంలో ఈరోజు అర్ధరాత్రి తన కొడుకు వారి ఇంటిలో ఉన్న ఫ్యాన్ కి చీరతో ఉరివేసుకొని చనిపోయినాడు అని తన తండ్రి అయిన మాడవేని నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలియజేసినారు.

## ఉపాధి హామీలో 'దొంగ' వేట: 60 లక్షల ప్రజాధనం స్వాహా?

### ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు!

**గన్నేరువరం, మే 11 (జనంసాక్షి):**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఓఉఔఖీఇఊ) కొందరికి అక్షయపాత్రలా మారింది. కరీంనగర్ జిల్లా, గన్నేరువరం మండలం, ఖాసీంపేట గ్రామంలో గత 3-4 ఏళ్లుగా సాగుతున్న భారీ అవినీతి బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ అధికార బలంతో ఉపాధి కూలీలను తన సొంత వ్యవసాయ పనులకు వాడుకుంటూ, ప్రభుత్వ ధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు.
అక్రమాల చిట్టా ఇదే:సొంత పనులకు కూలీలు: ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీలత, ఉపాధి హామీ కూలీలను నిబంధనలకు విరుద్ధంగా తన సొంత పొలం పనులకు వాడుకుంటూ, వారికి మస్టర్ వేసి ప్రభుత్వ నిధులను కాజేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.
నకిలీ మస్టర్లు - బినామీ పేర్లు:
గ్రామంలో లేని వారి పేర్ల మీద, చనిపోయిన వారి పేర్ల మీద, చివరకు పక్షవాతంతో మంచాన పడ్డ వారి పేర్ల మీద కూడా 100 రోజుల పని పూర్తి చేసినట్లు రికార్డులు సృష్టించారు.
ఫోటోల మాయాజాలం:
ఒకరి ఫోటో పెట్టి మరొకరి పేరుతో డబ్బులు డ్రా చేయడం, పాత పశువుల కొట్టాలు, కొత్తగా కట్టినట్లు చూపించి లక్షల రూపాయలు కాజేయడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు బాధితులు సాక్ష్యాలతో సహా పేర్కొన్నారు.
60 లక్షల కుంభకోణం:
గత పాలకుల అండదండలతో సుమారు 50 నుంచి 60 లక్షల రూపాయల వరకు ప్రజాధనాన్ని ఫీల్డ్ అసిస్టెంట్, సర్పంచ్ మరియు ఇతర అధికారులు కలిసి పంచుకున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ముఖ్యమైన సాక్ష్యాలు: ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం... గతంలో జరిగిన తనిఖీల్లో (రానీఇతిజీశ్రీ ంబీటతిబి) తప్పులు దొరికినా,





కేవలం నామమాత్రపు జరిమానాలతో అధికారులు చేతులు దులుపుకున్నారని సమాచారం. నగయ్య అనే వ్యక్తి కరీంనగర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నా, ఇక్కడ పని చేసినట్లు మస్టర్ వేయడం వారి బరితెగింపుకు నిదర్శనం. "ప్రభుత్వ నిధులను కాజేస్తూ, అర్హులైన కూలీలకు అన్యాయం చేస్తున్న సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. సమగ్ర విచారణ జరిపి దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలి." ఖాసీంపేట గ్రామస్థులు. ఈ ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం ఏ విధంగా స్పందిస్తుందో, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.



## కేపీఎల్ ఫైనల్ కు చేరిన జిపిఎల్ లెజెండ్స్

**మంథని, ( జనంసాక్షి ) :**
పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలో స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం ఏర్పాటు చేసిన కమాన్ పూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గత 20 రోజులుగా కొనసాగుతున్నది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం జరిగిన సెమీ ఫైనల్ - 2 మ్యాచ్ లో దామన్న ఫాలోవర్స్ వర్సెస్ జిపిఎల్ లెజెండ్స్ తలపడ్డాయి. ఆదివరాహ దేవాలయ చైర్మెన్ ముస్త్యాల దామోదర్ పాల్గొని సెమీఫైనల్ మ్యాచ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల్ అధ్యక్షులు రాజ్ రెబల్, క్రీడాకారులు పాల్గొన్నారు. మొదట బ్యాటింగ్ చేసిన జిపిఎల్ లెజెండ్స్ 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జిపిఎల్ లెజెండ్స్ టీమ్ నిర్ణీత 10 ఓవర్స్ లో 7 వికెట్స్ కోల్పోయి 84 పరుగులు చేసింది. ఇందులో మట్ట రమేష్ 22 పరుగులు, అరుణ్ 12 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్ చేసిన దామన్న ఫాలోవర్స్ 75 పరుగులకు అల్ అవుట్ అయ్యారు. ఇందులో కోనేటి సత్యనారాయణ 22 పరుగులు, ముల్కల సురేష్ 17 పరుగులు చేశారు. ఈ విజయంతో జీపీఎల్ లెజెండ్స్ టీమ్ ఫైనల్ చేరిన రెండో జట్టుగా నిలిచింది. ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు జరగనున్న కమాన్ పూర్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ లో ఎంకె రైడర్స్ తో జిపిఎల్ లెజెండ్స్ తలపడనున్నారు.